# కరోనా కూడా జునోటిక్ వ్యాధి మాత్రమే !

## (06 జూలై "ప్రపంచ జునోసిస్ దినం" సందర్భంగా)

అనాదిగా మనిషికి, పశుపక్ష్యాదులకు మధ్య అవిభాజ్య సంబంధం బలపడింది. గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఎడ్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్ళు, కుక్కలు, పిల్లులు, బాతులు, పక్షులు, గుర్రాలు, పందులు, కుందేళ్లు మొదలైన పెంపుడు జంతువులు భాగమై ఉంటాయి. ఈ పెంపుడు జంతువులతో మానవులు ప్రేమను పంచుకుంటూ, వాటిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వాటి ఆలనాపాలనా చూసుకుంటూ, ఎత్తుకొని ముద్దు చేస్తూ, భుజాన వేసుకొని తిరుగుతూ ఉంటారు. ఇలాంటి సాదు జంతువులు వ్యాధికారక సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులతో ఇన్ఫెక్ట్ అయితే ఆయా జంతువుల నుంచి మానవులకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు (జునోటిక్) లేదా మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే (రివర్స్ జునోటిక్) వ్యాధులను "జునోటిక్ వ్యాధులు"గా పిలుస్తాం. దాదాపు 130 రకాల సూక్ష్మజీవులు, 60 వరకు పరాన్నజీవుల వల్ల దాదాపు 250 రకాల జునోటిక్ వ్యాధులు సోకుతాయని వెల్లడయ్యింది. . ప్రుంచవ్యాప్తంగా 114కు పైగా దేశాల్లో జునేటిక్ వ్యాధుల బెడద అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రతి 10 వ్యాధుల్లో 6 జునోటిక్ సంబంధ వ్యాధులే ఉన్నాయని తెలుస్తున్నది.

### ప్రపంచ జునోసిస్ దినం-2025 ఇతివృత్తం:

జునోటిక్ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించే వేదికలుగా ప్రతి ఏట 06 జూలై రోజున "ప్రపంచ జునోసిస్ దినం (వరల్డ్ జునోసిస్ డే)" పాటించనట ఆనవాయితీగా మారింది. 06 జూలై 1885 రోజున "లూయీ పాశ్చర్" అను ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు తొలిసారి పిచ్చి కుక్క కరిచిన వ్యక్తికి ఆంటీ రాబిస్ టీకా ఇవ్వడం జరిగింది. ఈ విప్లవాత్మకమైన ఘనతకు గుర్తుగా ప్రతి ఏట 06 జూలైన ప్రపంచ జునోసిస్ దినం పాటించడం పరిపాటి అయ్యింది. ప్రపంచ జునోసిస్ దినం-2025 ఇతివృత్తంగా "ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం : జునోటిక్ వ్యాధులను నిరోధించడం (వన్ వరల్డ్, వన్ హెల్త్ : ప్రివెంట్ జునోసిస్)" అను అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం 61 శాతం వ్యాధులు జునోటిక్ సంబంధమైనవే అని, దాదాపు 1400 వ్యాధికారక సుక్ష్మజీవులు లేదా పాథోజెన్స్ పలు రకాల జంతువులను ఇన్ఫెక్ట్ చేస్తాయని, గత దశాబ్ద కాలంలో కరోనా లాంటి 75 శాతం కొత్త జునోటిక్ వ్యాధులే ఉన్నాయని తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 మిలియన్ల ప్రజలు సాదు జంతువులతో సహజీవనం చేస్తున్నారు. ఈగలు, దోమలు, పేలు, కీటకాలతో కూడా జునోటిక్ వ్యాధులు సంక్రమించవచ్చు. గతంలో మిలియన్ల ప్రజల మరణాలకు కారణం అయిన బొవైన్ టిబీ, బుబోనిక్ ప్లేగ్, గ్లార్స్, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు కూడా జునోటిక్ సంబంధమైనవా మాత్రమే అని తెలుసుకోవాలి.

### జునోటిక్ వ్యాధులు సోకడానికి కారణాలు:

ప్రత్యక్షంగా వ్యాధికారక బ్యాక్టీరియా లేదా వైరస్ సోకిన పెంపుడు జంతువుల లాలాజలం, మూత్రం, మలం, రక్తం, శ్లేష్మం లాంటివని మనుషులు తాకినపుడు జునోటిక్ వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువులను తాకినా, సమీపంలో గడిపినా, గోర్లతో గీకినా కూడా ఈ వ్యాధులు రావచ్చు. కలుషిత, పూర్తిగా ఉడకని ఆహారం (మాంసం, గుడ్లు, పాలు, జంతువులు ముట్టిన పండ్లు) తీసుకున్నపుడు కూడా ఈ వ్యాధులు రావచ్చు. పచ్చి పాలు తాగినా జునేటిక్ వ్యాధులు రావచ్చని, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు కూడా జునోటిక్ వ్యాధులు సులభంగా సోకుతాయి. భారత్‌లో జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా కనిపిస్తున్నది. సాదు జంతువులు, జంతు ప్రయోగశాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు వైద్యులు, చర్మం/తోళ్ళ పరిశ్రమలు, ధాన్య గిడ్డంగులు జునోటిక్ వ్యాధులకు కారణాలుగా నిలుస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. పాడి పంటలు, సాదు జంతువులే జీవనోపాధులుగా గడుపుతున్న పేద కుటుంబాలకు జునోటిక్ వ్యాధుల సమస్యలు అధికంగా ఉంటున్నాయి.

### జునోటిక్ వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు:

జునోటిక్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జంతువులను తాకిన ప్రతిసారా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. దోమలు, ఈగలు లాంటివని రాకుండా జాగ్రత్త పడాలి. పచ్చి పాలు తాగడం మానేయాలి. ఆహారాన్ని పూర్తిగా ఉడికించాలి. వంట సామాగ్రిని శుభ్రంగా కడగాలి. చనిపోయిన జంతువులను భూమిలో పాతి పెట్టాలి. జంతువులను తాకు సందర్భాల్లో మాస్కులు, చేతి గ్లౌజులు ధరించాలి. అధిక కాలం ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. జంతు మలమూత్రాలతో నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. త్రాగే నీటిని మరిగించి వాడాలి. గర్భిణులు, శిశువులు, వృద్ధులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారు, మధుమేహం గల వారు, ఆల్కహాల్ సేవించే వారు జునోటిక్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మసులుకుంటూ, జీవనోపాధులను పొందుతూ, జునోటిక్ వ్యాధులకు దూరంగా, ఆరోగ్యకర కుటుంబాలకు దగ్గరగా జీవిద్దాం, జంతు సంబంధ వ్యాధులను పొలిమేరలు దాటిద్దాం.

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700047

# ద్యూరాండ్ కప్ టోర్నమెంట్ ట్రోఫీలను ఆవిష్కరించిన రాష్ట్రపతి




న్యూఢిల్లీ, జులై 5:రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఈ రోజు (2025, జులై 4) జరిగిన కార్యక్రమంలో ద్యూరాండ్ కప్ టోర్నమెంట్ 2025 ట్రోఫీలను శ్రీమతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించారు.

క్రీడలు క్రమశిక్షణను, పట్టుదలను, బృంద స్ఫూర్తిని పెంచుతాయని రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజలను, ప్రాంతాలను, దేశాలను ఏకం చేసే శక్తి క్రీడలకు ఉందని అన్నారు. భారత్‌లో జాతీయ ఐక్యతకు క్రీడలు శక్తిమంతమైన సాధనాలుగా ఆమె అభివర్ణించారు. ఒలింపిక్స్ లేదా అంతర్జాతీయ క్రీడల్లో త్రివర్ణ పతాకం ఎగురుతుంటే తోటి పౌరులంతా పులకరించిపోతారని వివరించారు.

లక్షలాది మంది హృదయాల్లో ఫుట్‌బాల్‌కు ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్రపతి అన్నారు. ఇది ఓ క్రీడాంశం మాత్రమే కాదు.. ఓ ఉద్వేగం. ఫుట్‌బాల్ అంటే సమష్టి లక్ష్యాన్ని సాధించేందుకు వ్యూహం, సహనం, అందరూ కలసి పనిచేయడమని పేర్కొన్నారు. ద్యూరాండ్ కప్ లాంటి పోటీలు క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా.. తర్వాత తరం ఫుట్‌బాల్ క్రీడాకారులను తయారు చేస్తాయని, వారు ఎదిగేందుకు అవసరమైన వేదికను అందిస్తాయని రాష్ట్రపతి అన్నారు.. ద్యూరాండ్ కప్‌ను సజీవంగా ఉంచడంలో, దాన్ని స్ఫూర్తిని కొనసాగించడంలో భద్రతాదళాలు పోషిస్తున్న పాత్రను ఆమెను ప్రశంసించారు.

# విశాఖ వందేభారత్ కు అదనపు కోచ్‌లు ...

**-ప్రయాణికులు రద్దీ దృష్ట్యా రైల్వే శాఖ నిర్ణయం**
**-ఎగ్జిక్యూటివ్ కోచ్‌లను పెంచిన అధికారులు**

హైదరాబాద్, జులై 5: సికింద్రాబాద్- విశాఖపట్నం- సికింద్రాబాద్ వందేభారత్ (20707, 20708)కు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కోచ్‌ల సంఖ్య పెంచుతూ దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా మరో నాలుగు కోచ్‌లను అదనంగా పెంచారు. దీంతో హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం మధ్య తిరిగే ప్రయాణికులకు కొంత వరకు ఇబ్బందులు తొలుగుతాయి.

### 18కి పెరిగిన ఏసీ చైర్ కార్ కోచ్‌లు

సికింద్రాబాద్- విశాఖపట్నం- సికింద్రాబాద్ వందేభారత్ కు దక్షిణ మధ్య అధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు ఏసీ చైర్ కార్ కోచ్‌లు 18కి పెరిగాయి.

ఇప్పటి వరకూ 14 ఏసీ చైర్ కార్ కోచ్‌లు ఉండగా, అదనంగా మరో నాలుగు కోచ్‌లను ఏర్పాటు చేశారు.

వీటితో పాటు రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌ల సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం వందేభారత్ కోచ్‌ల సంఖ్య 20కి చేరింది.

# గ్లోబల్ సౌత్‌కు కోసం భారతదేశ దార్శనికత.. మహాసాగర్: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 5:ట్రినిడాడ్ అండ్ టొబాగో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. సెనేట్ అధ్యక్షులు వాడే మార్క్, దిగువ సభ స్పీకర్ జగదేవ్ సింగ్ ఆహ్వానం మేరకు హాజరైన ఆయన.. ఆ దేశ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించిన మొదటి ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించారు. భారతదేశం, ట్రినిడాడ్ అండ్ టొబాగో ద్వైపాక్షిక సంబంధాలలో ఇది ఒక కీలక కార్యక్రమంగా నిలిచిపోతుంది.

ప్రపంచంలోనే అతిపెద్దదైన ప్రజాస్వామ్య దేశమైన భారత్ తరపున సభలో ఉన్న ప్రతినిధులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అత్యున్నత జాతీయ గౌరవాన్ని తనకు అందించినందుకు ఆ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని వివరిస్తూ దేశాన్ని ప్రజాస్వామ్య మాతగా పేర్కొన్నారు. దేశ సంస్కృతి, జీవనంలో ప్రజాస్వామ్యం అంతర్భాగంగా ఉందని అన్నారు. భారతదేశ వైవిధ్యం సుసంపన్నంగా మారేందుకు, అన్ని ఆలోచనలు సహజీవనం చేస్తూ కొనసాగేలా ఇది ఉపయోగపడిందని వివరించారు. అంతేకాకుండా పార్లమెంటరీ ప్రక్రియలు, బహిరంగ చర్చలను పెంపొందించాయని అన్నారు.

ప్రజాస్వామ్యంతో విజయవంతంగా సాగిస్తోన్న ప్రయాణం పట్ల ఆ దేశానికి అభినందనలు తెలియజేశారు. స్వేచ్ఛా మార్గంలో ఆ దేశ ప్రజలతో సంఘీభావంగా నిలబడటం భారత్‌కు దక్కిన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. ఆధునిక దేశాలుగా ఇరు దేశాల మధ్య లోతుగా పాతుకుపోయిన బంధాలు మరింత బలపడుతున్నాయని ఆయన ప్రధానంగా చెప్పారు. భారతదేశం బహుమతిగా ఇచ్చిన స్పీకర్ కుర్చీలో ఇవి ప్రతిబింబిస్తున్నాయన్న ఆయన.. ద్వైపాక్షిక పార్లమెంటరీ సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి పిలుపునిచ్చారు. సభలో మహిళల భాగస్వామ్యం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆయన భారత పార్లమెంటు, రాష్ట్రాల శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశంలో చిట్టచివరి స్థాయిలో నాయకత్వం వహిస్తున్న మహిళా నాయకుల గురించి కూడా ఆయన వివరించారు. స్థానిక స్వపరిపాలన సంస్థలకు ప్రాతనిధ్యం వహిస్తోన్న1.5 మిలియన్ల మహిళల గురించి ప్రస్తావించారు.

మానవాళి ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రధానమంత్రి వివరించారు. శాంతిని కోరుకునే వారికి తీవ్ర ముప్పుగా మారిన ఉగ్రవాదంపై పోరాటాన్ని బలోపేతం చేయాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచ స్థాయి పరిపాలనలో సంస్కరణలు తీసుకురావాలని, గ్లోబల్ సౌత్‌కు ప్రాధాన్యత అందాల్సిన అవసరం ఉందని అన్నారు. భారతదేశం, కరీబియన్ సమాజం (క్యారీకోమ్) మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

ట్రినిడాడ్‌లో భారతీయుల రాకకు 180 సంవత్సరాలు నిండిన సందర్భంగా జరుగుతున్న వేడుకలను గుర్తు చేసిన ఆయన.. రెండు దేశాల మధ్య సంబంధాలు శతాబ్దాల నాటి సంబంధాలపై ఆధారపడి ఉన్నాయన్నారు. ఇవి మరింతగా వృద్ధి చెందుతూనే ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధానితో భేటీ అయిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 5:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లోని రెడ్ హౌస్‌లో ట్రినిడాడ్ టొబాగో రిపబ్లిక్ ప్రధానమంత్రి గౌరవ కమ్లా ప్రెసాద్ బిసెసాతో భేటీ అయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో ఘన విజయం సాధించి రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెకు అభినందనలు తెలిపారు. తనకు అపూర్వ స్వాగతం పలికినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ఔషధాలు, డిజిటల్ పరివర్తన, యుపీఐ, సామర్థ్యాలను మెరుగుపరచడం, సంస్కృతి, క్రీడలు, ప్రజల అనుసంధానత సహా అనేక రంగాల్లో పరస్పర సహకారంపై ఇరువురు నేతలు చర్చించారు. ఇరుదేశాల భాగస్వామ్యంలో అభివృద్ధిపరమైన సహకారం ఒక కీలక భాగం.. ట్రినిడాడ్ టొబాగోలో భారత ప్రధానమంత్రి చారిత్రక పర్యటన ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను తిరిగి బలోపేతం చేస్తుందని ప్రధానమంత్రి బిసెసా పేర్కొన్నారు.

ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై ఇరువురు నేతలు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. వాతావరణ మార్పు, విపత్తు నిర్వహణ, సైబర్ భద్రత వంటి సమకాలీన సవాళ్లను ఎదుర్కోవడానికి మరింత సహకారం అవసరమని వారు పిలుపునిచ్చారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత ప్రజలకు టీ అండ్ టీ అందించిన బలమైన మద్దతు, సంఘీభావాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. అన్ని ఉగ్రవాద రూపాలు, వ్యక్తీకరణలపై పోరాడటం పట్ల తమ నిబద్ధతను ఇరువురు నేతలూ పునరుద్ఘాటించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య మరింత సంఘీభావం కోసం, భారత్-సీఏఆర్ఐసీఓఎమ్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయడానికి వారు అంగీకరించారు.

చర్చల అనంతరం ఫార్మసీ, సత్వర ప్రభావం గల ప్రాజెక్టులు, సంస్కృతి, క్రీడలు, దౌత్యపరమైన శిక్షణ, హిందీ.. భారతీయ అధ్యయనాల కోసం ఐసీసీఆర్ అధ్యయన కేంద్రాలకు సంబంధించిన ఆరు అవగాహన ఒప్పందాలను మార్చుకున్నారు. టీ అండ్ టీలో భారత సంతతికి చెందిన ఆరో తరం ప్రజలకు ఓసీఐ కార్డు అందించడం సహా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచే దిశగా పలు ప్రకటనలు చేశారు. కుదిరిన ఒప్పందాల జాబితాను ఇక్కడ చూడవచ్చు.

ప్రధానమంత్రి కమ్లా ప్రెసాద్ బిసెసాను భారత్‌లో పర్యటించాలని ప్రధానమంత్రి ఆహ్వానించగా.. ఆమె దానికి అంగీకరించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోలో భారత ప్రధానమంత్రి చారిత్రక పర్యటన ఇరు దేశాల మధ్య ప్రత్యేక సంబంధాలకు ఊతమిచ్చింది.

# వల్లభనేని వంశీకి 'నానీ'ల పలకరింత



విజయవాడ, జులై 5: రాష్ట్ర రాజకీయాల్లో ఆప్త మిత్రులుగా పేరొందిన మాజీ మంత్రులు కొడాలి నాని , పేర్ని నాని , వల్లభనేని వంశీ శనివారం ఉంగుటూరు మండలం తెలప్రోలు లో శనివారం సాయంత్రం కలుసుకున్నారు. ఈసందర్భంగా ముగ్గురు నాయకులు ఆప్యాయంగా మాట్లాడుకుంటూ, జోకులు వేసుకుంటూ సరదాగా గడిపారు. వివిధ కేసుల్లో వంశీ బెయిల్ పై విడుదలైన తర్వాత మాజీ మంత్రి కొడాలి నాని తొలిసారి కలుసుకున్నారు.

ముగ్గురు నాయకులు సుధీర్ఘంగా పలు అంశాలపై మాట్లాడుకున్నారు. పేర్ని నాని వేసిన జోకులకు అక్కడున్న నాయకులు కడుపుబ్బా నవ్వుకున్నారు. రాజకీయాల్లో లెజెండ్స్ అయినా ముగ్గురు నేతల భేటీతో కృష్ణా జిల్లా వైసీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా వివిధ కేసుల్లో అక్రమ అరెస్టు అయ్యి బెయిల్ పై విడుదలైన వంశీ సన్నిహితులను కొడాలి నాని పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, కృష్ణాజిల్లా యువజన విభాగ అధ్యక్షులు మెరుగు మాల కాళీ, నందివాడ మండలం ఎంపీపీ పెయ్యల ఆదాం, గుడివాడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అడపా హర్ష, సింహాద్రి రాంబాబు, చుండూరు శేఖర్, కందుల నాగరాజు, పుల్లేటికుర్తి కృష్ణా రావు, పాలడుగు రాంప్రసాద్, యార్లగడ్డ సత్య భూషణ్, కసుకుర్తి బాబ్జి, గన్నవరం, కృష్ణా జిల్లాకు చెందిన పలువురు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విలీనమైతే.. ఆ పల్లెలకు ప్రగతి బాట!

**-ఆంధ్ర నుంచి వేరు చేయాలని వినతి**
**-ఎన్నో ఏళ్లుగా ఏజెన్సీ వాసులు ఎదురు చూపు!**
**-ఎన్నికల సమయంలో తెరపైకి విలీన అంశం**
**-ఆ తర్వాత మరుగున పడుతున్న వైనం!**

భద్రాచలం, జులై 5:భద్రాచలం ఏజెన్సీకి చెందిన ఐదు గ్రామాలను రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ఐదు గ్రామాలు ప్రగతి బాటలో పయనించాలంటే తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. అయితే ఎన్నికల సమయంలో తెరపైకి తీసుకొస్తున్న ఈ అంశాన్ని ఎన్నికల అనంతరం మరుగున పడుతుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఈ గ్రామాల ప్రజల కోరిక మాత్రం నెరవేరడం లేదు.

రాష్ట్ర విభజన సమయంలో గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకల పాడు, పురుషోత్తం పట్నం ఆంధ్రలో విలీనం చేశారు. పోలావరం ప్రాజెక్టు విషయంలో ఇబ్బందులు లేకుండా ఈ ఐదు గ్రామాలను భద్రాచలం నుంచి వేరు చేసి ఆంధ్రలో కలిపారు. అయితే తమకు అన్ని అనుకూలంగా తెలంగాణ ప్రాంతం ఉందని, అలాగే అభివృద్ధికి కూడా నోచుకోవడం లేదని ఆయా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా వారు కోరుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు 2023లో బీఆర్ఎస్ ఈ గ్రామస్థుల కోరికను ఒక అంశంగా తెరపైకి తెచ్చింది. ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరింది. ఎన్నికల తర్వాత ఆ విషయం మరుగున పడింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు సైతం ఈ విషయంపై అనేక హామీలు గుప్పించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని ఆయా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. బహుశ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్‌లో ఉండడం వల్ల ఈ అంశాన్ని పట్టించుకోలేదన్న విమర్శలు లేకపోలేదు.

రాష్ట్ర విభజనతో భద్రాచలం పట్టణానికి కష్టకాలం మొదలైంది. గతంలో అత్యంత పెద్దగా ఉన్న భద్రాచలం నియోజకవర్గం కుదించుకుపోయింది. ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న వి.ఆర్పురం, కూనవరం, చింతూరు, ఎటపాక వంటి ప్రాంతాలు ఆంధ్రాలో కలిసిపోయాయి. జిల్లాల విభజనతో భద్రాచలం నియోజకవర్గంలో ఉన్న వాజేడు, వెంకటాపురం మండలాలను ములుగు జిల్లాలో చేర్చారు. ఈ క్రమంలో పేరుకు భద్రాచలం నియోజకవర్గం అయినప్పటికీ అక్కడి ప్రజలు తమతమ అవసరాల కోసం ములుగు జిల్లా ప్రధాన కేంద్రానికి వెళ్లడానికి అలవాటు పడ్డారు. దీంతో భద్రాచలం పట్టణం వ్యాపారులు వాణిజ్యపరంగా దెబ్బతినారు. మరోవైపు పోలవరం బ్యాక్ వాటర్ దెబ్బకు ప్రతి సంవత్సరం భద్రాచల పట్టణం రెండు నుంచి మూడు నెలల పాటు నీటమయమవుతుంది.

తెలంగాణలోకి ఐదు గ్రామపంచాయతీలను తక్షణం విలీనం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రికి లేఖ రాశారు. ప్రజల భావోద్వేగాలు, రాజ్యాంగ పరంగా కూడా ఈ గ్రామాల విలీనాన్ని వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్స్ స్కాలర్ షిప్ లు విడుదల చేయాలి.. ఎస్ఎఫ్ఐ




హైదరాబాద్, జులై 5:పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చెయ్యాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని నిరసన తెలియజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ మాట్లాడుతూ గత 6 ఏళ్లుగా రాష్ట్రం లో ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ విడుదల చేయలేదని, దాదాపు 8400 కోట్ల రూపాయలకు పైగా పెండింగ్ లో ఉన్నాయన్నారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ విడుదల చెయ్యకపోవడం వల్ల ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఎంబిబిఎస్ నర్సింగ్ చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తమ విద్యను పూర్తి చేసుకొని ఉన్నత విద్యకు వెళ్లాలంటే సర్టిఫికెట్స్ కచ్చితంగా అవసరం కావడంతో ప్రైవేట్ కళాశాలలు ఫీజు రీయింబర్స్ మెంట్ రాలేదు కాబట్టి, కాలేజీ ఫీజు మొత్తం కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తున్నారన్నారు. దీని వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు.

గతంలో సీఎం రేవంత్ రెడ్డి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ విడుదల చేస్తామని బహిరంగంగా ప్రకటించి ఏడాది గడుస్తున్నా విడుదల చేయని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వాలు మారినా పాలన మారడం లేదని, ప్రభుత్వం, అధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చెయ్యాలని, లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తాము విద్యార్థులతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అనిల్, జిల్లా కమిటీ సభ్యులు అభిషేక్, సిద్దార్థ తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్లూరు-సదుం మార్గంలో ఏనుగు మృతి

చిత్తూరు, జులై 5 : చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని కల్లూరు-సదుం రహదారిలోని చిట్టారెడ్డిపేట సమీపంలో ఒక అడవి ఏనుగు మృతిచెందిన సంఘటన కలకలం రేపింది. వెదురు పొదల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఈ వార్త తెలియగానే పరిసర గ్రామాల ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని ఏనుగును చూడటానికి పోటెత్తారు.

ఇటీవలి కాలంలో పులిచెర్ల మండల పరిధిలో ఏనుగుల గుంపులు సంచరిస్తూ మామిడి, కొబ్బరి, అరటి వంటి పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏనుగు కూడా ఆ గుంపులోకి చెందిందో లేదో స్పష్టత లేదు. ప్రస్తుతం ఏనుగు మృతికి గల కారణాలను అధికారులు విశ్లేషణ జరుపుతున్నారు. అటవీ శాఖ అధికారులు మృతదేహాన్ని పరిశీలించి మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు.



# గిరిజనులపై పవన్ కు 'మధుర'మైన అభిమానం

## -ఆదివాసీలపై పవన్ మమకారం
## -230 కుటుంబాలకు మామిడిపండ్లు గిఫ్ట్..

అమరావతి, జులై 5: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి , జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ గిరిజనులపై తనకున్న ప్రత్యేక





ప్రేమను మరోసారి చాటుకున్నారు. ఏకంగా కురిడి గ్రామస్తుల కోసం నోరూరించే మామిడిపండును పంపించారు. మన తోటలో ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేసి పండించిన మామిడి పండ్లను గిరిజనులకు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో ప్రత్యేక వాహనంలో కురిడి గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం కార్యాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి మామిడి పండ్లను పంపిణీ చేశారు. దాదాపుగా 230 వరకు గడపలుండే కురిడి గ్రామంలో ఇంటికి అరడజను చొప్పున మధురమైన మామిడి పండ్లను అందించారు. మా పవన్ కళ్యాణ్ సారు పంపిన మామిడి పండ్లు అంటూ పిల్లలు పెద్దలు ఇష్టంగా తిన్నారు. పవన్ సారు చల్లంగా ఉండాలంటూ ఆశీర్వదించారు.

ప్రజలపై ఆయనకు ఉన్న ప్రేమ, మమకారం ఈ చర్యలో స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణ రైతుగా ఉన్న తన నేపథ్యాన్ని మర్చిపోకుండా, ప్రజలతో గాఢమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ పవన్ కళ్యాణ్ చూపిన ఈ అందమైన చర్య గ్రామస్థుల మన్ననలు అందుకుంది. 'మా పవన్ కళ్యాణ్ సారు పంపిన మామిడి పండ్లు' అంటూ పిల్లలు,పెద్దలు ఇష్టంగా వాటిని తిన్నారు.

కాగా, ఇటీవల'అడవి తల్లి బాట' కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లాలో పవన్ కళ్యాణ్ పర్యటించారు. డుంబ్రిగూడ మండలం పెద్దపాడు, కురిడి గ్రామాలకు వెళ్లారు. ఆయా గ్రామాల రహదారి కష్టాలు తీర్చేందుకు అక్కడ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం గ్రామస్థులతో మాట్లాడి వారి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. అప్పుడు ఏర్పడిన అనుబంధంతోనే ఇప్పుడు వారికి తన తోటలోని పండ్లను పంపించారు. గతంలో పెద్దపాడు గ్రామస్థులకు చెప్పులు అందజేశారు.

# సుస్థిర మైనింగ్ విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




హైదరాబాద్, జులై 5:వికసిత్ భారత్ లో భాగంగా దేశంలోని వివిధ ఖనిజ పరిశ్రమలు తమ ఉత్పత్తులు పెంచాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో ప్రకృతి పట్ల, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా మైనింగ్ ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

శుక్రవారం హైదరాబాద్ లోని ట్రైడెంట్ హోటల్లో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి మైనింగ్ సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. పర్యావరణహిత, బాధ్యతాయుత మైనింగ్ అనే అంశంపై ఈ సదస్సును కేంద్ర బొగ్గు, గనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశ అవసరాలకు అనుగుణంగా తగినంత బొగ్గు, అల్యూమినియం, రాగి తదితర ఖనిజాలను ఉత్పత్తి చేసి, ఈ రంగాలలో దేశాన్ని స్వయంసమృద్ధి దిశగా నడిపించాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉందని, అదే సమయంలో ప్రకృతికి నష్టం జరగకుండా, ప్రజలకు ఉపయోగపడే విధంగా బాధ్యతాయుత మైనింగ్ ను నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ దిశగా పటిష్టమైన నిబంధనలను రూపొందించుకొని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బొగ్గు గనులు ప్రారంభించడంతోపాటు అవి నడుస్తున్నప్పుడు, మూత పడినప్పుడు కూడా ఆ ప్రాంత ప్రకృతికి, ప్రజలకు ఉపయోగపడే విధంగా, యధాతథస్థితిని నెలకొల్పే విధంగా పరిశ్రమలు చర్యలు తీసుకోవాలన్నారు. తమిళనాడు రాష్ట్రంలో కొన్ని గనులు ఈ విషయంలో దేశానికి ఆదర్శప్రాయంగా ఉన్నాయని పేర్కొన్నారు.

మూసివేసిన గనుల ద్వారా స్థానిక ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించారని, ఈ తరహా పద్ధతులను ఇతర పరిశ్రమల వారు కూడా ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గు గనుల్లో అనుసరిస్తున్న గనుల మూసివేత విధానాలను ఇతర ఖనిజ పరిశ్రమలలో కూడా అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు.

పర్యావరణహిత మైనింగ్ తో పాటు ప్రజల భాగస్వామ్యంతో వారి అభివృద్ధికి తోడ్పడే విధానాలను మైనింగ్ పరిశ్రమ ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విచ్చేసిన మైనింగ్ సంస్థల వారు, మైనింగ్ మేధావులు ఈ సదస్సులో తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు బొగ్గు శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే , బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి రూపేంద్ర బ్రార్, కోలిండియా చైర్మన్ శ్రీ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్, వివిధ ఖూజల అటఆలు, బొగ్గు, అల్యూమినియం, రాగి పరిశ్రమల అధికారులు మరియు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సదస్సులో ముందుగా పర్యావరణహిత, ప్రజాహిత మైనింగ్ ప్రక్రియ విషయాలను వివరిస్తూ రూపొందించిన మిషన్ గ్రీన్ బుక్, రిక్లెయిమ్ అనే పుస్తకాలను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. అలాగే అన్వేషణ విభాగం కోసం సింగిల్ విండో విధానం అమలు జరుపుతూ రూపొందించిన పోర్టల్ ను కూడా ఆవిష్కరించారు. అలాగే ఆన్ లైన్ ద్వారా 24వ నైవేలి బుక్ ఫెయిర్ 2025ను కూడా ప్రారంభించారు.

హైదరాబాద్‌లో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సు సందర్భంగా కిషన్ రెడ్డి గారు మీడియాతో మాట్లాడిన ముఖ్యంశాలు

ఈ సదస్సుకు దేశంలోని పబ్లిక్ సెక్టార్‌లో పనిచేస్తున్న మైనింగ్ కంపెనీలు, అంతర్జాతీయ మైనింగ్ సంస్థల నుంచి సుమారు 8 దేశాలకు చెందిన 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

మైనింగ్ రంగంలో, కోల్, లైమ్‌స్టోన్, ఐరన్ ఓర్ వంటి ఖనిజాల అన్వేషణ పూర్తయ్యిన తర్వాత శాస్త్రీయ పద్ధతిలో మైన్ క్లోజర్ యాక్టివిటీ చేయాల్సిన అవసరం ఉంది.

మైన్ క్లోజర్ యాక్టివిటీలను విస్మరించడం వల్ల పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి, భూములు ఉపయోగపడట్లేదు, ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

మైనింగ్ పూర్తయ్యిన తర్వాత ఆ భూమిని చదును చేసి, స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. కొన్ని ప్రాంతాల్లో మైనింగ్ పూర్తయిన భూముల్లో ఫిషరీస్ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

మైనింగ్ పూర్తయిన తర్వాత భూములను ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ గారు స్పష్టంగా ఆదేశించారు.

ప్రభుత్వ పరంగా ఇప్పటివరకు 143 మైనింగ్ ప్రాజెక్టులు మైనింగ్ పూర్తయిన అనంతరం డీకోల్ అయ్యాయి. ఈ మైన్స్ అన్నింటినీ మైన్ క్లోజర్ యాక్టివిటీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఈ యాక్టివిటీలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ఇప్పటికే రూపొందించబడింది.

వచ్చే మూడు సంవత్సరాల్లో ఈ కోల్ బ్లాక్స్ అన్నిటికీ మైన్ క్లోజర్ యాక్టివిటీస్ చేపట్టి, పర్యావరణాన్ని రక్షించేందుకు, ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రకృతికి అనుకూలమైన అభివృద్ధి కోసం మైన్ క్లోజర్ యాక్టివిటీలను కొనసాగించేలా కార్యాచరణ రూపొందించబడుతోంది.

ఈ సమావేశంలో మైన్ క్లోజర్ యాక్టివిటీలకు సంబంధించి విస్తృతంగా చర్చ జరుగుతోంది.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.53 లక్షలు లూటీ

హైదరాబాద్, జులై 5: నగరంలో సైబర్ నేరగాళ్లు మరోసారి విజృంభించారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సరికొత్త మోసానికి పాల్పడి, అమీర్‌పేటకు చెందిన 77 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ. 53 లక్షలు కొల్లగొట్టారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది.

గత నెల 18న బాధితుడికి ఒక గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఢిల్లీ డీసీపీ రాజీవ్ కుమార్‌ను అని పరిచయం చేసుకున్నాడు. బాధితుడిపై మనీలాండరింగ్ కేసు నమోదైందని, అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయిందని నమ్మబలికాడు. వెంటనే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని బెదిరించాడు. తన మాటలను బాధితుడు నమ్మేలా చేయడానికి, బ్యాంకు ఖాతాలను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లుగా ఒక నకిలీ ఆర్డర్ కాపీని వీడియో కాల్‌లో చూపించాడు.

దీంతో తీవ్ర ఆందోళనకు గురైన వృద్ధుడు, తనపై కేసు నమోదు చేయవద్దని వారిని వేడుకున్నాడు. ఇదే అదనుగా భావించిన నేరగాళ్లు, కేసు నుంచి బయటపడాలంటే తమకు సహకరించాలని సూచించారు. ఖాతాలోని డబ్బును తాము చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేస్తే వాటిని పరిశీలించి తిరిగి జమ చేస్తామని మాయమాటలు చెప్పారు.

వారి మాటలు నమ్మిన బాధితుడు విడతలవారీగా రూ. 53 లక్షలను వారు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశాడు. డబ్బులు అందిన వెంటనే సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ కట్ చేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. ఎంత ప్రయత్నించినా వారి నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# 'గనుల మూసివేతకు ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా సుస్థిర, బాధ్యతాయుత మైనింగ్' అంశంపై అంతర్జాతీయ సదస్సు విజయవంతం

న్యూఢిల్లీ, జులై 5:'గనుల మూసివేతకు ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా సుస్థిర, బాధ్యతాయుత మైనింగ్' అనే అంశంపై ఇండియన్ నేషనల్ కమిటీ ఆఫ్ ది వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ-డబ్ల్యూఎంసీ) నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఈ రోజు విజయవంతంగా పూర్తయింది. ఈ సదస్సు హైదరాబాద్‌లో జరిగింది.

భారత్‌తో పాటు విదేశాలకు చెందిన విధాన రూపకర్తలు, పారిశ్రామిక దిగ్గజాలు, పర్యావరణ నిపుణులు, విద్యార్థులు, ఇతరులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సురక్షితంగా గనుల మూసివేతకు సంబంధించిన పరిష్కారాలు, అంతర్జాతీయంగా అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను ఇక్కడ చర్చించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, ఐఎన్‌సీ-డబ్ల్యూఎంసీ నిర్వాహకుడు శ్రీ జీ కిషన్ రెడ్డి హాజరయ్యారు. భారతీయ మైనింగ్ రంగానికి పర్యావరణ హిత, సురక్షితమైన భవిష్యత్తును అందించడంపై తన ఆలోచనలు పంచుకోవడం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిలో స్ఫూర్తిని నింపారు. అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ.. బాధ్యతాయుతమైన, సురక్షితమైన మైనింగ్ పద్ధతులను అనుసరించడంలో ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని తెలియజేశారు.

గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఐఎన్‌సీ-డబ్ల్యూఎంసీ కో-ఛైర్‌పర్సన్ శ్రీ వీఎల్ కాంతారావు, కోల్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్, ఐఎన్‌సీ-డబ్ల్యూఎంసీ సభ్య కార్యదర్శి శ్రీ పీఎం ప్రసాద్ సహా ఇతర ఉన్నతాధికారులు తమ విలువైన ఆలోచనలు పంచుకొని అర్థవంతమైన చర్చలకు బలమైన పునాది వేశారు. సదస్సు ఇతివృత్తాన్ని ఆలోచనాత్మకంగా పరిచయం చేయడంతో పాటు, చర్చల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఐఎన్‌సీ-డబ్ల్యూఎంసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్ రూపిందర్ బ్రార్ సదస్సు స్థాయిని పెంచారు.

ఈ కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ వక్తలు తమ వినూత్న ఆలోచనలను, సుస్థిరమైన, బాధ్యతాయుతమైన మైనింగ్, గనుల మూసివేత ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచుకున్న సమష్టి దృక్పథాలు భారతీయ మైనింగ్ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తోడ్పతాయి.

మిషన్ గ్రీన్ బుక్‌లెక్, కాపర్, అల్యూమినియం విజన్ డాక్యుమెంట్లు, రిక్లెయిమ్ నియమావళి, ఎక్స్‌ప్లోరేషన్ మాడ్యూల్ ఆఫ్ ది సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్ (ఎస్‌డబ్ల్యూసీఎస్), 24 వ నెవేలీ పుస్తక ప్రదర్శన తదితరమైన వాటిని విడుదల చేశారు. ఈ రంగంలో సుస్థిరత, భద్రత, ఆవిష్కరణలను బలోపేతం చేయడంలో కీలకమైన విజయాలుగా ఇవి నిలిచిపోతాయి.

ఈ సదస్సులో భారత్ కు చెందిన అగ్రశ్రేణి మైనింగ్, పారిశ్రామిక సంస్థలు పాల్గొన్నాయి. వాటిలో కోల్ ఇండియా, ఎన్ఎల్‌సీ ఇండియా, ఎస్‌సీసీఎల్, ఎంసీఎల్, ఎన్‌సీఎల్, ఎన్ఈసీఎల్, హిందాల్కో, ఎన్ఎండీసీ, ఎన్‌టీపీసీ మైనింగ్, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ, జీఎండీసీ, ఏపీఎండీసీ, జిందాల్ పవర్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, బీసీసీఎల్, సీఎంపీడీఐ, నాల్కో, సీసీఎల్, డబ్ల్యూసీఎల్, ఈసీఎల్, డీవీసీ, హిందూస్థాన్ కాపర్, తదితర సంస్థలు ఉన్నాయి. ఇవి బాధ్యతాయుతమైన వృద్ధిని సాధించడంతో పరిశ్రమల ఉమ్మడి అంకితభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, విద్యార్థులు, విలేకరులు, ప్రతినిధులు, పరిశ్రమల భాగస్వావులు, ఈ కార్యక్రమాన్ని విజయవంతమయ్యేందుకు కృషి చేసిన కార్యక్రమ నిర్వహణ బృందానికి ఐఎన్‌సీ-డబ్ల్యూఎంసీ ధన్యవాదాలు తెలియజేసింది.

పర్యావరణ హిత, సురక్షితమైన, సమ్మిళితమైన భవిష్యత్తు దిశగా భారతీయ మైనింగ్ రంగాన్ని నడిపించేందుకు చేపట్టాల్సిన చర్చలు, విధానాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న ఐఎన్‌సీ-డబ్ల్యూఎంసీ లక్ష్యాన్ని ఈ సదస్సు తెలియజేస్తుంది.

# నాణ్యతా ప్రమాణాలు లేని హెల్మెట్ల పై కేంద్రం ఉక్కుపాదం

న్యూఢిల్లీ, జులై 5:ద్విచక్ర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తయారవుతున్న, అమ్ముడవుతున్న హెల్మెట్లపై ఉక్కుపాదం మోపింది. అటువంటి హెల్మెట్లను తయారుచేసే సంస్థలు, విక్రయించే రిటైలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఐఎస్ఐ మార్క్ ఉన్న, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సర్టిఫికేషన్ పొందిన హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని ప్రజలకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.




దేశంలో 21 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, రైడర్ల భద్రత అత్యంత ముఖ్యమని ప్రభుత్వం పేర్కొంది.

మోటారు వాహనాల చట్టం-1988 ప్రకారం హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని గుర్తుచేసింది. రోడ్ల పక్కన అమ్మే నాణ్యత లేని హెల్మెట్ల వల్ల ప్రమాద సమయంలో ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. నాణ్యమైన హెల్మెట్ల వాడకం ద్వారా తలకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదాలు తగ్గుతున్నప్పటికీ, ఈ విషయంలో ఇంకా చాలా చేయాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు.

హెల్మెట్ల నాణ్యతను నిర్ధారించేందుకు 2021లోనే కేంద్రం ఒక క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్‌ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఐఎస్ఐ మార్క్ హెల్మెట్లను మాత్రమే విక్రయించాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 176 సంస్థలకు మాత్రమే నాణ్యమైన హెల్మెట్లు తయారు చేయడానికి బీఐఎస్ లైసెన్సులు ఉన్నాయి.

నిబంధనల అమలును పర్యవేక్షించడానికి బీఐఎస్ అధికారులు నిరంతరం ఫ్యాక్టరీలు, మార్కెట్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 500కు పైగా హెల్మెట్ నమూనాలను పరీక్షించగా, బీఐఎస్ మార్క్‌ను దుర్వినియోగం చేస్తున్న వారిపై 30కి పైగా సోదాలు నిర్వహించి, హెల్మెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క ఢిల్లీలోనే లైసెన్సులు రద్దయిన 9 సంస్థల నుంచి 2,500కు పైగా నాణ్యత లేని హెల్మెట్లను అధికారులు సీజ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, పోలీసు యంత్రాంగానికి కేంద్రం ఇప్పటికే లేఖలు రాసింది.

# బడిలో చేర్చుకోమంటూ కమిషనర్ కు వేడికోలు .. చలించిపోయిన మంత్రి లోకేష్

నెల్లూరు, జులై 5: చదువుకోవాలన్న తపనతో ఇద్దరు చిన్నారులు అధికారులను వేడుకున్న ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా చలించిపోయారు. ఆ పిల్లల విద్యాభ్యాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను తక్షణమే ఆదేశించారు. వారి కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

వివరాల్లోకి వెళితే, నెల్లూరు నగరంలోని వీఆర్ స్కూలు వద్ద పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారులు తమను బడిలో చేర్పించాలంటూ కమిషనర్‌ను ప్రాధేయపడ్డారు. ఈ విషయం మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో మంత్రి లోకేశ్ దృష్టికి వెళ్లింది. ఈ ఘటనపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ''చిన్నారులు తమకు చదువు చెప్పించాలని కమిషనర్‌ను ప్రాధేయపడటం నన్ను కదిలించింది. వారి చదువుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాల్సిందిగా అక్కడి అధికారులను ఆదేశించాను'' అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

పేదరికం నుంచి బయటపడటానికి విద్య ఒక్కటే బలమైన సాధనమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలన్న కసి, పట్టుదల ఉంటే ఎలాంటి కష్టాలనైనా అధిగమించవచ్చని ఆయన అన్నారు. ఈ చిన్నారుల ఆశయ సాధనకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఓ వెబ్‌సైట్‌లో వచ్చిన కథనాన్ని కూడా ఆయన తన పోస్టుతో పాటు పంచుకున్నారు.

# నీటి సంపులో పడి బాలుడి మృతి

వేములవాడ రూరల్, జూలై 5 : నీటి సంపులో పడి ఓ బాలుడు(6) మృతి చెందాడు. ఈ సంఘటన వేములవాడ మండలం చింతల్టన గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంపల్లి స్వప్న-రవి ఏకైక కుమారుడు లింగంపల్లి రిషీ (6) తన స్నేహితులతో కలిసి ఇంటి సమీపంలోని కొత్తగా నిర్మాణం అవుతున్న భవనం వద్ద ఆడుకుంటున్నారు.

కాగా ప్రమాదవశాత్తు రిషీ నీటి సంపులో పడిపోగా స్నేహితులు చూసి కుటుంబ సభ్యులకు తెలిపారు. కాగా వారు వచ్చి చూసే సరికి రిషీ మృతి చెంది ఉన్నాడు. రవి-స్వప్న దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు కాగా రిషీ ఒక్కడే కుమారుడు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రైతులకు ట్రాన్స్‌ఫార్మర్స్ అందజేయకుంటే సబ్ స్టేషన్లను ముట్టడిస్తాం

కొల్లాపూర్, జులై 5: డీడీలు కట్టిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందించకపోతే విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొల్లాపూర్‌నియోజకవర్గానికి చెందిన రైతులతో కలిసి శనివారం జిల్లా కలెక్టర్ సంతోష్ కు వినతిపత్రానిన సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఇప్పటి వరకు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడంలేదని ఆరోపించారు. వానాకాలం సీజన్ ప్రారంభైన కూడా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేయడం లేదన్నారు. రైతులకు రైతు భరోసా సరిగ్గా అందడం లేదని ఆరోపించారు.

శాటిలైట్ కారణంగా దాదాపు 6వేల మంది సన్నకారు రైతులకు రైతు భరోసా వేయకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వేరుశెనగ పంట సాగు చేసే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను అందించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, కోడేరు మండలా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల అందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూరెడ్డి రఘువర్ధన్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు ఉన్నారు.

# లాలూ ప్రసాద్ నాయకత్వంలోనే అసెంబ్లీ ఎన్నికలకు ఆర్‌జేడీ.. అధ్యక్షుడిగా ఎంపికైన మాజీ సీఎం



న్యూఢిల్లీ, జులై 5: రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడిగా మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి ఎంపికయ్యారు. శనివారం ఆయనకు జాతీయ అధ్యక్షుడిగా పార్టీ నేతలు సర్టిఫికెట్‌ను అందజేశారు. పట్నాలోని బాపు ఆడిటోరియంలో ఆర్‌జేడీ కార్యవర్గ సమావేశం జరిగింది. రామచంద్ర పూర్వే అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయనను జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. త్వరలో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగున్న విషయం తెలిసిందే. ఆయన నాయకత్వంలోనే ఆ పార్టీ మరోసారి ఎన్నిలకు సిద్ధమవుతున్నది. లాలూ ప్రసాద్ యాదవ్ జూలై 5, 1997న తన సహచరులతో కలిసి రాష్ట్రీయ జనతాదళ్‌ను స్థాపించారు.

అప్పటి నుండి లాలూ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే, ఇటీవల ఆర్‌జేడీ అధ్యక్షుడి బాధ్యతలు మరొకరికి అప్పగించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఎందుకంటే ఆయన ఆరోగ్యం గతంలో లేకపోవడమే. కొంతకాలంగా ఆయన తరుచూ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. తాజాగా అన్ని ఊహాగానాలకు స్వస్తి పలుకుతూ లాలూ ప్రసాద్ యాదవ్ జూన్ 23న పార్టీ కార్యాలయంలో అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మరెవరూ పార్టీ అధ్యక్ష పదవికి పోటీ పడకపోవడంతో ఎన్నికల అధికారి డాక్టర్ రామచంద్ర పూర్వే ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

# సింహాచలంలో అప్పన్న సన్నిధిలో తప్పిన పెను ప్రమాదం

విశాఖపట్నం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో పెను ప్రమాదం తప్పింది. అప్పన్న సన్నిధిలో గిరి ప్రదక్షిణ కోసం తొలి పావంచా వద్ద వేసిన భారీ రేకుల షెడ్డు కూలిపోయింది. ప్రమాద సమయంలో షెడ్డు కింద ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఈ నెల 9వ తేదీన సింహాచలంలో గిరి ప్రదక్షిణ జరగాల్సి ఉంది. గిరి ప్రదక్షిణ కోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇందులో భాగంగా భక్తుల సౌకర్యార్థం శనివారం నాడు భారీ రేకుల షెడ్డులను ఏర్పాటు చేశారు. అయితే పునాదుల్లో కాంక్రీట్ వేయకపోవడంతో షెడ్డు బరువు ఎక్కువై కూలిపోయింది. షెడ్డు కూలిన సమయంలో కింద భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఇదిలా ఉంటే ఏప్రిల్ 30వ తేదీన నిర్వహించిన సింహాద్రి అప్పన్న చందనోత్సవం సమయంలోనూ ఇలాంటి ప్రమాదమే చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈదురుగాలులతో నాసిరకం గోడ కూలిపోయి క్యూలైన్‌లో ఉన్న భక్తుల మీద పడింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు భక్తులు మృతిచెందగా.. 15 మంది గాయపడ్డారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి : మొహమ్మద్ షానూర్ బాబా

నల్గొండ, జులై 5:: జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షానూర్ బాబా ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆలేరు పట్టణంలో రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చినప్పకీ అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ప్లాట్‌లను చూపించలేకపోయిందన్నారు.

ఈ ప్రభుత్వమైనా జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను వెంటనే పరిష్కరించి ఆదుకోవాలన్నారు. ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కుళ్ల సిద్దులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ నరేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మొహమ్మద్ నబి పాల్గొన్నారు.

# విపత్తుల నిర్వహణకు నల్లగొండ యంత్రాంగం సిద్ధం : కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ, జులై 05 : విపత్తుల నిర్వహణకు నల్లగొండ జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అధికారుల బృందం జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాశ్, అండర్ సెక్రెటరీ అభిషేక్ బిస్వాల్, వసీం ఇక్బాల్‌తో కూడిన బృందం రాష్ట్ర విపత్తుల నిర్వహణ అధికారి గౌతమ్ ఆధ్వర్యంలో ఒక రోజు నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టర్‌ను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో విపత్తుల నిర్వహణ అథారిటీ ఉన్నట్లుగానే జిల్లా స్థాయిలో జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో అన్ని శాఖల అధికారులను భాగస్వామ్యం చేసినట్లు వెల్లడించారు. వివిధ సందర్భాల్లో వచ్చే విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేసినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా తుఫాను, వరదలు, తదితర ప్రకృతి వైపరీత్యాల పరిధిలో లేనప్పటికీ ఒకవేళ విపత్తులు సంభవిస్తే ఎలా స్పందించాలో ప్రణాళిక ఉన్నట్లు చెప్పారు.

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. జిల్లాలో 12వ పోలీస్ బెటాలియన్ ఉందని, ఒక కంపెనీ దళాలు (సుమారు 80 నుండి 100 మంది) కి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాశ్ మాట్లాడుతూ? జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ కింద 2021లో ఆపదమిత్ర వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని జిల్లాల్లో ఆపద మిత్రలను ఏర్పాటు చేస్తున్నామని, అంతేకాక విపత్తుల సమయంలో అవసరమైన రిసోర్సెస్ ఏర్పాటు చేస్తున్నామని, ఆపద మిత్రుల శిక్షణ, విపత్తుల్లో వారు తీసుకోబోయే చర్యలపై అవసరమైన సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీఓ వై.అశోక్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## చెట్లను నరికిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు : అటవీ శాఖ అధికారిణి రేణుక

హైదరాబాద్, జులై 5:చర్లపల్లి డివిజన్ శివసాయినగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికిన వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అటవీశాఖ అధికారిణి రేణుక పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివసాయినగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మ(ర్రి)చెట్టు, తాడిచెట్లను నరకడంతో నిరసనగా సీసీఎస్, కాలనీవాసుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఆందోళనలో భాగంగా జిల్లా అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఆమె సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి పంచానామా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెట్లను నరికివేసేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేయడం నరికాదన్నారు. జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. శివసాయినగర్‌లో చెట్లను నరికివేయడంతో పక్షులు మృతి చెందాయని, చెట్లను నరికివేసిన వ్యక్తులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షుడు, శివసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్యక్షుడు ఎంపెల్లి పద్మారెడ్డి, కాలనీ ప్రతనిధులు కొండగళ్ల ఆశోక్, బింగి బిక్షపతి, కందుల సత్యనారాయణ, షాబాద్ దామోదర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సరికొండ రమేశ్, సత్యనారాయణ, గోపాల్‌కృష్ణ, గోపాల్, కాలనీవానులు తదితరులు పాల్గొన్నారు.

# కేయూ 23వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి..
## హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

హన్మకొండ, జులై 5:ఈనెల 7న కాకతీయ విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం కేయూ సెనెట్‌హాల్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరిక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ సమక్షంలో ఆయన విలేకరులతో వివరాలు వెల్లడించారు.

స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యఅతిథిగా శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని వీసీ వివరించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే స్నాతకోత్సవంలో ఆర్ట్స్ ఫాకల్టీలో 60 గోల్డ్ మెడల్స్, 56 పీహెచ్‌డీలు, సైన్స్ ఫాకల్టీలో 161 గోల్డ్ మెడల్స్, 96 పీహెచ్‌డీలు, ఫార్మసీ ఫాకల్టీలో 48 గోల్డ్ మెడల్స్, 21 పీహెచ్‌డీలు, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫాకల్టీలో 66 గోల్డ్ మెడల్ లు, 49 పీహెచ్‌డీలు, సోషల్ సైన్సెస్ ఫాకల్టీలో 88 గోల్డ్ మెడల్స్, 133 పీహెచ్‌డీలు, ఎడ్యుకేషన్ ఫాకల్టీలో 25 గోల్డ్ మెడల్స్, 18 పీహెచ్‌డీలు, లా ఫాకల్టీలో 72 గోల్డ్ మెడల్స్, 4 పీహెచ్‌డీలు, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫాకల్టీలో 44 గోల్డ్ మెడల్స్, 10 పీహెచ్‌డీలు, ఇలా మొత్తం 564 గోల్డ్ మెడల్స్ , 387 పీహెచ్‌డీలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

అకాడమిక్ సెనేట్ సమావేశంతో స్నాతకోత్సవం ప్రారంభమవుతుందని, అనంతరం గవర్నర్, ముఖ్యఅతిథి, వీసీ, రిజిస్ట్రార్, పూర్వపు ఉపకులపతులు, కంట్రోలర్, డీన్స్, పాలకమండలి సభ్యులు, సెనెట్ సభ్యులతో కలిసి గ్రూప్ ఫొటో తీసుకుంటారని వీసీ చెప్పారు. ఆ తర్వాత సెనేట్ సభ్యుల పొసేషన్ నిర్వహించబడుతుందని, వెంటనే బంగారు పతకాలు, పట్టాల పంపిణీ కార్యక్రమం ఆడిటోరియంలో జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 1:15 గంటలకు స్నాతకోత్సవ కార్యక్రమం ముగుస్తుందని, ఈ వేడుకను అన్ని విభాగాల సహకారంతో విజయవంతంగా నిర్వహించాలనే దిశగా చర్యలు తీసుకుంటన్నామని, కార్యక్రమ నిర్వహణ కోసం ఒక స్టీరింగ్ కమిటీతో పాటు మొత్తం



10 సబ్ కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి కమిటీలో కన్వీనర్, కో కన్వీనర్‌లతో బాటు 10 మంది సభ్యులు ఉన్నారని, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులతో కలిపి వేసిన ఈ కమిటీలు కష్టపడి స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నారని వీసీ తెలిపారు. వివిధ కమిటీలు వారంరోజులుగా పనిచేస్తున్నట్లు వీసీ తెలిపారు.

విద్యార్థిసంఘాలతో వీసీ సమావేశం..

కేయూ స్నాతకోత్సవాన్ని అడ్డుకుంటామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించడంతో శనివారం వారితో వీసీ ప్రతాప్‌రెడ్డి సమావేశమయ్యారు. కేయూ భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి కేయూ భూములు కేటాయించవద్దని ఇప్పటికే విద్యార్థిసంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తుండటం, ఈసీ సభ్యుల దిష్టిబొమ్మ దహనం, రోజూ నిరసన కార్యక్రమాలు చేపడుతుండటంతో కేయూ 23వ స్నాతకోత్సవాన్ని అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని, ఎలాంటి నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టవద్దని వీసీ విద్యార్థులకు సూచించారు.

# ఔట్ సోర్సింగ్ విధానం ఎత్తివేసి వర్సిటీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



హైదరాబాద్, జులై 5:రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి, ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఉస్మానియా యూనివర్సిటీలో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పద్మ శ్రీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యూనివర్సిటీలకు నిధులు గ్రాంట్స్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. వర్సిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, బడా కంపెనీలు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని మండిపడ్డారు. కార్మిక హక్కులను కాపాడుకోవడం కోసం జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రమాదకర కార్మిక చట్టాలు కార్మికులను కట్టు బానిసల్లా మారుస్తాయని అనుమానం వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పనిని తీసేసి 12 గంటల పనిని ఎవరి ప్రయోజనాల కోసం తీసుకువస్తున్నారని ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ (అమెజ ) అధ్యక్షులు టి.మహేందర్, సీఐటీయూ నగర నాయకులు దశరథ్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు ,శ్రీను, నాగరాజు, సహాయ కార్యదర్శులు వీరేష్, పోచయ్య, అంజమ్మ, కిషోర్, కుమార్, ఈశ్వరయ్య, ప్రవిీల, అరుణ, ఐలమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో బాలుడి పరార్.. గుర్తించి జీఆర్పీకి అప్పగించిన ప్రయాణికులు

వరంగల్, జులై 5: ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా పారిపోతున్న ఓ బాలుడిని జీఆర్పీ పోలీసులు రక్షించారు. తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో ప్రయాణికులు గుర్తించి కాజీపేట రైల్వే జంక్షన్‌లో పోలీసులకు అప్పగించారు.

కాజీపేట జీఆర్పీ సీఐ వద్దే నరేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం నాడు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు ప్రయాణిస్తున్న బి.చంద్రశేఖర్, ఎండీ అజార్ అలీ అనే ఇద్దరు ప్రయాణికులకు 13 ఏళ్ల బాలుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని వివరాలు అడగ్గా పొంతన లేని సమాధానాలు ఇచ్చాడు. దీంతో ఆ బాలుడిని పట్టుకుని కాజీపేట జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో జీఆర్పీ పోలీసులు సదరు బాలుడిని విచారించి వివరాలు రాబట్టారు.

బాలుడిని మెదక్ జిల్లాలోని మెదక్ చర్చి సమీపంలో నివసించే కంచుమూర్తి గంగాధర్ కుమారుడు ప్రీతమ్ సందీప్‌గా గుర్తించారు. ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చినట్లు తమ విచారణలో బాలుడు చెప్పాడని సీఐ నరేశ్ కుమార్ తెలిపారు. కాగా, ప్రీతమ్ సందీప్‌ను పునరావాసం కోసం హనుమకొండ చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ హరీశ్‌కు అప్పగించామన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు.

# "త్రిభువన్" సహకారి విశ్వవిద్యాలయానికి గుజరాత్‌లోని ఆనంద్‌లో భూమి పూజ చేసిన కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జులై 5:"త్రిభువన్" సహకారి విశ్వవిద్యాలయం (టీఎస్‌యూ)కు గుజరాత్‌లోని ఆనంద్‌లో కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా 2025 జులై 5న భూమి పూజ చేస్తారు. ఇది దేశంలోనే మొట్టమొదటి సహకార విశ్వవిద్యాలయం. ఈ కార్యక్రమానికి గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్రభాయ్ పటేల్, అసెంబ్లీ స్పీకర్ శ్రీ శంకర్ చౌదరి హాజరవుతారు. కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రులు శ్రీ కృషన్ పాల్ గుర్జర్, శ్రీ మురళీధర్ మొహోల్, గుజరాత్ విద్యాశాఖ మంత్రి శ్రీ హృషికేష్ పటేల్, సహకార మంత్రి శ్రీ జగదీశ్ విశ్వకర్మ, సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశీష్ కుమార్ భుటానీ, టీఎస్‌యూ ఉపకులపతి డాక్టర్ జేఎం వ్యాస్, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మార్గనిర్దేశకత్వంలో "త్రిభువన్" సహకార విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం. అలాగే సహకార రంగంలో సామర్థ్యాన్ని పెంపొందించడానికి, 'సహకార్ సే సమృద్ధి' లక్ష్యాన్ని నెరవేర్చడానికి సహకరించే దార్శనిక కార్యక్రమం. సహకారం, ఆవిష్కరణ, ఉపాధికల్పన అనే త్రివేణిని సాకారం చేయడంలో ఈ విశ్వ విద్యాలయం ప్రధానమైన మైలురాయిగా నిలుస్తుంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపుతో ప్రజా ఉద్యమంగా మారిన ''ఏక్ పేడ్ మా కే నామ్'' కార్యక్రమంలో భాగంగా కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మొక్కలు నాటుతారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక విలువల పట్ల బాధ్యతను పెంచుతుంది. అలాగే సహకార సూత్రాలు, దేశంలో సహకార ఉద్యమ ప్రభావంపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకు నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) రూపొందించిన పాఠ్యాంశాలను కూడా శ్రీ ఆవిష్కరిస్తారు.

సహకార రంగంలో పెరుగుతున్న అవసరాలకు తగినట్టుగా నిపుణులు, శ్రామిక శక్తిని సిద్ధం చేయడమే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏర్పాటు చేసిన 'త్రిభువన్' సహకారి విశ్వవిద్యాలయం లక్ష్యం. సహకార నిర్వహణ, ఆర్థికం, చట్టం, గ్రామీణాభివృద్ధి లాంటి రంగాల్లో ప్రత్యేక విద్య, శిక్షణ, పరిశోధన అవకాశాలను ఈ విశ్వవిద్యాలయం అందిస్తుంది. అలాగే ఆవిష్కరణలను, సామర్థ్య నిర్మాణాన్ని, ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడం, పరిపాలనను మెరుగుపరచడం, సమ్మిళిత, సుస్థిర గ్రామీణ ఆర్థిక అభివృద్ధిని మెరుగుపరచడం ద్వారా సహకార సంస్థలను ఈ విశ్వవిద్యాలయం సాధికార పరుస్తుంది.

జాతీయ విద్యా విధానం 2020 ఆధారంగా ఈ విశ్వవిద్యాలయం కోర్సులను అందిస్తోంది. పీహెచ్‌డీ, మేనేజర్ స్థాయిలో డిగ్రీలు, సూపర్‌వైజర్ స్థాయిలో డిప్లొమాలు, ఆపరేషనల్ స్థాయిలో సర్టిఫికెట్ లాంటి బహుళ కోర్సులను అందిస్తోంది. తన క్యాంపస్‌తో పాటుగా ఇతర రాష్ట్రాల్లో సబ్జెక్టుల వారీగా పాఠశాలలను ఏర్పాటు చేస్తుంది.

అలాగే సహకార విద్య, శిక్షణను ప్రామాణీకరించడానికి, విస్తరించడానికి జాతీయ స్థాయిలో వ్యవస్థను రూపొందిస్తుంది. దీన్ని ఏర్పాటు చేయడానికి వచ్చే ఐదేళ్లలో ఇప్పటికే ఉన్న 200 సహకార సంస్థలను అనుసంధానిస్తుంది.

నైపుణ్యాభివృద్ధి, సామర్థ్య నిర్మాణంలో భారత్‌కు 40 లక్షల సహకార సిబ్బంది, 80 లక్షల బోర్డు సభ్యులు అవసరమని అంచనా. వచ్చే ఐదేళ్లలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్), డైరీ, ఫిషరీస్, తదితర సహకార సంఘాలకు అవసరమైన 20 లక్షల మంది సిబ్బందికి ఈ విశ్వవిద్యాలయం శిక్షణ ఇస్తుంది.

అర్హులైన ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి సహకార విద్య ఆధారంగా పీహెచ్‌డీ కార్యక్రమాలు చేపట్టి బలమైన టీచర్ల వ్యవస్థను విశ్వవిద్యాలయం అభివృద్ధి చేస్తుంది. ప్రస్తుతం సహకార విద్య కొన్ని రాష్ట్రాలు, విద్యాసంస్థలకు మాత్రమే పరిమితమైంది. ఇది ఈ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి సరిపోదు.

సహకార వ్యవస్థలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణలు, చౌకగా లభించే సాంకేతికతలపై దృష్టి సారించే పరిశోధనాభివృద్ధికి తోడ్పాటును అందించే సంస్థాగత వ్యవస్థ ప్రస్తుతం భారత్‌లో లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా పరిశోధన, అభివృద్ధి మండలిని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తారు. ఇది సహకార రంగంలో పరిశోధన, అభివృద్ధికి కృషి చేస్తుంది. అనుబంధ సంస్థల్లో జరిగే పరిశోధనలు ఈ మండలి ప్రోత్సహిస్తుంది. ఇవే కాకుండా.. భారత్‌లో ఉత్తమ పద్ధతులను అవలంబించడానికి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాలను ఏర్పాటు చేస్తుంది.

# మహంకాళి జాతరకు పజ్జన్నకు ఆహ్వానం



హైదరాబాద్, జులై 5:చారిత్రాత్మక ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఏ ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ ప్రభుత్వానికి సూచించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయాన్ని సందర్శించి, బోనాలు వేడుకల్లో భాగస్వామ్యం కావాలని ఆలయం కార్యనిర్వహణాధికారి మహేందర్ రెడ్డి, ప్రధాన అర్చకుల నేతృత్వంలోని బృందం మోండా మార్కెట్ టకార బస్తీలోని పద్మారావు గౌడ్ నివాసాన్ని శనివారం సందర్శించి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా పద్మారావు దంపతులను సత్కరించి ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో కిషోర్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మంచి వాణిజ్య ప్రకటనలను తప్పుదారి పట్టించే వాటి నుంచి వేరు చేసేందుకు నైతిక ప్రకటనల అంశానికి విద్యాపరంగా ప్రాధాన్యత ఇవ్వాలన్న ఐఐఎంసీ వీసీ డాక్టర్ అనుపమ భట్నాగర్

న్యూఢిల్లీ, జులై 5:ఐఐఎంసీ ఢిల్లీలో అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఏఎస్‌సీఐ)తో కలిసి డీమ్డ్ విశ్వవిద్యాలయమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసి) భారీ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని (ఎఫ్‌డీపీ) నిర్వహించింది. మీడియా, ప్రకటనల రంగం, మార్కెటింగ్, న్యాయ సేవ, మేనేజ్‌మెంట్ రంగాల్లో మాత్రమే కార్యకలాపాలు నిర్వహించే వివిధ సంస్థల అధ్యాపకులకు బాధ్యతాయుతమైన ప్రకటనలు, స్వీయ నియంత్రణ, రూపాంతరం చెందుతోన్న మీడియా రంగ సూత్రాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రారంభ సెషన్‌లో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ (ఎంఐబీ) సంయుక్త కార్యదర్శి శ్రీ సీ. సెంథిల్ రాజన్.. ఐఐఎంసి ఉపకులపతి డాక్టర్ అనుపమ భట్నాగర్.. ఏఎస్‌సీఐ సీఈఓ, సెక్రటరీ జనరల్ శ్రీమతి మనీషా కపూర్.. నెస్లే డైరెక్టర్, సీనియర్ ఉపాధ్యక్షులు (వ్యూహం, మార్కెటింగ్, కమ్యూనికేషన్) శ్రీ చందన్ ముఖర్జీ పాల్గొన్నారు. ఐఐఎంసీ రిజిస్ట్రార్ డాక్టర్ నిమిష్ రుస్తాగి కూడా దీనికి హాజరయ్యారు.

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ సీ. సెంథిల్ రాజన్ కీలకోపన్యాసం చేశారు. ప్రకటనలకు సంబంధించిన నియమావళి, నైతిక చట్రాల గురించి అవగాహన కూడిన తదుపరి తరం కంటెంట్ క్రియేటర్లను సన్నద్ధం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలను తప్పకుండా నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రధానంగా ప్రస్తావించారు. "ప్రకటనలను సంబంధించిన నియమ నిబంధనలను ప్రతి కంటెంట్ క్రియేటర్ అర్థం చేసుకోవాలి. భారతదేశంలో అత్యుత్తమ సృజనాత్మక కలిగిన వారిని ఐఐఎంసీ బయటకు తీసుకొస్తోంది. ఈ వర్క్‌షాప్ వంటి కార్యక్రమాలు వారి నైపుణ్యాలను పదును పెట్టటమే కాకుండా వారి అవగాహనను పెంచుతాయి. ప్రకటనల రంగంలో నైతికత గురించి అవగాహన పెంచేందుకు వీలుగా అధ్యాపకులు, విద్యార్థుల కోసం ఇలాంటి మరిన్ని వర్క్‌షాప్‌లు, కార్యక్రమాలకు సహాయం చేసేందుకు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సంతోషాన్ని వ్యక్తం చేస్తోంది" అని వ్యాఖ్యానించారు.

సృజనాత్మక రంగాల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి ముంబయిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తోందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

ఐఐఎంసీ ఉపకులపతి డాక్టర్ అనుపమ భట్నాగర్ మాట్లాడుతూ నైతిక విలువలతో ఉన్న ప్రకటనల ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో పొందిన పరిజ్ఞానాన్ని తరగతి గదిలో బోధించాలని అధ్యాపకులను కోరారు. "నైతిక పద్ధతులను అనుసరిస్తూ విద్యార్థుల సృజనాత్మక సామర్థ్యాలను పెంపొందించటాన్ని మేం నమ్ముతాం. మంచి ప్రకటనలు, తప్పుదారి పట్టించే ప్రకటనల మధ్య తేడాను విద్యార్థులు గుర్తించగలగాలి" అని అన్నారు.

ఏఎస్‌సీఐ సెక్రటరీ జనరల్, సీఈఓ శ్రీమతి మనీషా కపూర్ మాట్లాడుతూ ఇటువంటి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ఏఎస్‌సీఐ కోడ్, డిజిటల్ యుగంలో విస్తరిస్తోన్న స్వీయ-నియంత్రణ పాత్ర గురించి పలు విషయాలను పంచుకున్నారు. "బాధ్యతాయుతమైన ప్రకటనలలో మన పాత్రను విస్తరించాలంటే.. భవిష్యత్తు నిపుణులకు శిక్షణ ఇచ్చే వారితో మన పని ప్రారంభించాలి. వినియోగదారుల విశ్వాసంతో నడిచే ప్రకటనల వ్యవస్థను తయారు చేయటంలో ఇక్కడ చేపడుతోన్న ఈ చర్చలు చాలా ముఖ్యమైనవి" అని అన్నారు.

బాధ్యతాయుతమైన ప్రకటనల గురించి నెస్లే డైరెక్టర్, సీనియర్ ఉపాధ్యక్షులు (వ్యూహం, మార్కెటింగ్, కమ్యూనికేషన్) చందన్ ముఖర్జీ మాట్లాడారు. ప్రజలకు ఇచ్చే ప్రతి వాణిజ్య ప్రకటన, సమాచారం.. నమ్మకం, నైతికత, బాధ్యతను నిలబెట్టేలా ఉండాలని ప్రధానంగా పేర్కొన్నారు. "వాణిజ్య ప్రకటనలు అంటే కేవలం అమ్మకాల గురించి కాదు. ఇది సమాజంతో నమ్మకాన్ని, సంబంధాలను ఏర్పరచుకోవటం" అని అన్నారు.

వినియోగదారు ప్రవర్తనకు సంబంధించిన పరిశోధన చేసే ఐఐఎంసీ రిజిస్ట్రార్ డాక్టర్ నిమిష్ రుస్తాగి మాట్లాడుతూ.. "నేటి డిజిటల్ యుగంలో వాణిజ్య ప్రకటనల విషయంలో నైతికత ఎన్నడూ లేనంత ముఖ్యమైనదిగా మారింది. ఆన్‌లైన్ వినియోగదారు ప్రవర్తనను తెలుసుకునే విషయంలో డేటా మైనింగ్ అనేది ప్రకటనదారులకు ఇస్తోన్న శక్తి సామర్థ్యాలు కూడా నైతికత ఆధారంగానే ప్రకటనదారు ఉండాలని తెలియజేస్తున్నాయి. వినియోగదారుల క్షేమం తగ్గకుండా, వారిని గౌరవించేలా ఇది మాత్రమే చేస్తుంది" అని అన్నారు.

## ఈ నెల 12న ఓయూకు భారత ప్రధాన న్యాయమూర్తి

హైదరాబాద్, జులై 5:భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఈ నెల 12న ఉస్మానియా యూనివర్సిటీకి రానున్నారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న కార్యక్రమంలో "భారత రాజ్యాంగం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సహకారం" అనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు. విద్యార్థులకు రాజ్యాంగంలోని కీలకమైన అంశాలను అవగాహన చేసుకునేందుకు ఈ ఉపన్యాసం తోడ్పడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

హైదరాబాద్, జులై 5: దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. నాచారంలోని పారిశ్రామికవాడలో నాచారం ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సమావేశం సీఐటీయూ ప్రధాన కార్యదర్శి గణేష్ అధ్యక్షతన చేపట్టారు.

కార్మిక హక్కుల కోసం చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టడానికి కార్మికులు ముందుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమ, శంకర్‌రావు, మారయ్య, చంద్రశేఖర్, దస్తగిరి, మల్లారెడ్డి, రమేష్, సూర్యం, ప్రవీణ, మధు, సత్యనారాయణ, శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌పీఎస్ పన్ను ప్రయోజనాలు తగిన మార్పులతో యూపీఎస్‌కూ వర్తింపు

న్యూఢిల్లీ, జులై 5:కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకం పొందిన వారికి ఎన్‌పీఎస్ కింద ఒక ఎంపికగా ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్)ను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం 24.01.2025 నాటి నోటిఫికేషన్ నెం. ఈూ-1/3/2023-ఖీ ద్వారా తెలియజేసింది. 01.04.2025 నుంచి అమలులోకి వచ్చిన ఈ నిర్ణయం ద్వారా జాతీయ పెన్షన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్) కింద గల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు యూపీఎస్‌కు మారడాన్ని ఎంచుకునేందుకు ఒకసారి అవకాశం ఉంటుంది.

ఈ విధానాన్ని అమలు చేయడానికి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) 2025, మార్చి 19న పీఎఫ్ఆర్‌డీఏ (ఎన్‌పీఎస్ కింద ఏకీకృత పెన్షన్ పథకం కార్యాచరణ) నిబంధనలు-2025ను వెల్లడించింది.

ఎన్‌పీఎస్ కింద ఒక ఎంపికగా యూపీఎస్ ఉన్నందున.. యూపీఎస్ విధానాన్ని మరింత ప్రోత్సాహించడం కోసం ఎన్‌పీఎన్ కింద అందుబాటులో ఉన్న పన్ను ప్రయోజనాలను యూపీఎస్‌కూ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ నిబంధనలు ప్రస్తుత ఎన్‌పీఎస్ నిర్మాణంతో సమానత్వాన్ని నిర్ధారిస్తూ.. ఏకీకృత పెన్షన్ పథకాన్ని ఎంచుకునే ఉద్యోగులకు గణనీయమైన పన్ను ప్రయోజనం, ప్రోత్సాహకాలనూ అందిస్తాయి.

పెన్షన్ సంస్కరణల పట్ల ప్రభుత్వ నిబద్ధత

యూపీఎస్‌ను పన్ను విధానంలో భాగం చేయడం.. పారదర్శకమైన, సౌకర్యవంతమైన, తక్కువ పన్ను గల ఎంపికల ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ భద్రతను బలోపేతం చేయు ప్రభుత్వ ప్రయత్నాల్లో మరో ముందడుగు.

# బీసీని సీఎం చేయండి

**-నేను బిజెపి అధ్యక్షపదవికి రాజీనామా చేసి బిసి ని అధ్యక్షున్ని చేస్తా**
**-బీసీ రిజర్వేషన్లు విషయంలో కాంగ్రెస్ బీసీ లను మోసం చేసింది**
**-ప్రజా సమస్యలే మా ప్రధాన ఏజెండా**
**-ఎఐఅఅ అంటే ఆల్ ఇండియా ఛీటింగ్ కమిటి అన్నట్టుగా వ్యవహరిస్తోంది కాంగ్రెస్.**
**-సమర భేరి" సభలో మోదీ,బిజెపి, ఆర్ఎస్ఎస్‌ను విమర్శించడమే తప్పమాట్లాడిందేమిలేదు**
**-ఆపరేషన్ సింధూర్ విషయంలో భారత సైనికుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడే వాళ్ల ప్రజల క్షమాపణ చెప్పాలి.**
**-మతపరమైన రిజర్వేషన్స్ కు బిజెపి వ్యతిరేకం**
**-కేంద్ర ప్రభుత్వ నిధులపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమా..?**
**-బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు**

హైదరాబాద్ జూలై 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మామూలు కార్యకర్తగా పార్టీలో పనిచేస్తూ, సైకిళ్లపై తిరుగుతూ పోస్టర్లు అంటించడం, బ్యానర్లు వేయడం, బూత్ ఏజెంట్‌గా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేయడం ద్వారా నా రాజకీయ ప్రయాణం బిజెపిలో ప్రారంభమైందన్నారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రాంచందర్ రావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో



మాట్లాడారు. విద్యార్థి పరిషత్‌లో ఉన్న సమయంలో ప్రారంభించిన ఉద్యమ స్వభావం, బిజెపిలో కొనసాగించాను. దేశంలో సొంత మెజార్టీతో బిజెపి ప్రభుత్వం 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. మరికొన్ని రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి ద్వారా అధికారంలో ఉంది. ఇటువంటి బలమైన పార్టీలో సాధారణ కార్యకర్తగా ఉన్న నాకు, పార్టీ అధిష్టానం నమ్మకంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతను అప్పజెప్పడం, నేను పనిచేసిన కృషికి గుర్తింపుగా భావిస్తున్నాను. బిజెపి అంటే కార్యకర్తల పార్టీ. ఈ రోజు తెలంగాణలో 40 లక్షల మంది కార్యకర్తలు బూత్ స్థాయిలో అహర్నిశలు పనిచేస్తున్నారు. బిజెపి బలోపేతం వెనుక వేలాది మంది కార్యకర్తల త్యాగాలు ఉన్నాయి. వారి ప్రాణత్యాగాలే బిజెపిని 14 కోట్ల సభ్యత్వంతో ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. నేను కూడా ఒక కార్యకర్తగా అహోరాత్రులు పార్టీ కోసం కృషి చేశాను. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు రెండు విఫలమైన ప్రభుత్వాలు. ఈ రోజు తెలంగాణ ప్రజలు బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు. ప్రజలు బిజెపికి ఒక అవకాశం ఇవ్వాలనే భావనతో ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రజలను మభ్యపెట్టే హామీలు ఇచ్చింది. రైతులు, మహిళలు, విద్యార్థులకు అనేక రకాల హామీలు ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత, "డబ్బుల్లేవు... ప్రభుత్వం భిక్షాటన స్థితిలో ఉంది... ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాం అని ఏడుస్తోందని ఎద్దేవా చేసారు.. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ హామీలు ఎలా ఇచ్చింది... ఇది ప్రజలను మోసం చేసే ఆలోచనే. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ఇవాటిలో ఏవీ అమలు చేయలేదు. రైతుల రుణ మాఫీను పూర్తిగా చేయకుండా మధ్యలో నిలిపివేశారు. రైతు భరోసా పేరుతో రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రూ. 12 వేలకు తగ్గించారు. ఇప్పటివరకు రెండు దఫాలు మోసం చేశారు. మళ్లీ సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా రూ. 6 వేలు చొప్పున మాత్రమే రైతు భరోసా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రైతులను మోసం చేస్తే, దగా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు. బిజెపి పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని తెలుసుకున్న కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. "తెలంగాణలో యూరియా లేదంటూ" దుష్ప్రచారం చేస్తున్నారు. యూరియా కొరత యూపీఏ ప్రభుత్వంలోనే వచ్చింది. ఆ సమయంలో యూరియాకు రైతులు షాపుల ముందు క్యూలలో నిలబడాల్సి వచ్చేది. యూరియా దొరక్క రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు జరిగాయి. కానీ ఇప్పుడు మోదీ ప్రభుత్వం తెలంగాణకు అవసరమైన మేరకు 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసింది. అదనంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను మంజూరు చేసింది .కేంద్రం పంపిన యూరియాను సకాలంలో సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోంది.

ఆ యూరియాను ఏమయ్యిందో చెప్పాలి. యూరియా సరఫరా విషయంలో బిజెపి చర్చకు సిద్ధంగా ఉంది. మరి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమా..గ్రెన్ నిర్వహించిన "సామాజిక న్యాయ సమర భేరి" సభలో మోదీ గారు, బిజెపి, ఆర్ఎస్ఎస్‌ను విమర్శించడమే తప్ప సామాజికంగా వెనుకబడిన వర్గాల గురించి కనీసం మాట్లాడలేదు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజల గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదు. కాంగ్రెస్ అవినీతి పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ ముక్త్ భారత్ కోరుతూ వరుసగా మూడు సార్లు కాంగ్రెస్ పార్టీని ఓడించారు. బిజెపి ప్రజల కోసం పనిచేసే పార్టీ, కాంగ్రెస్ అధికారం కోసం, అవినీతి కోసం పనిచేసే పార్టీ. ఐఏసిసి అంటే All India Cheating Committee అన్నట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్. అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ప్రజల మధ్య విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటోంది కాంగ్రెస్. ఇంత తక్కువ కాలంలో ఇంతటి వ్యతిరేకత వచ్చిన పార్టీ మరొకటి లేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గట్టి బుద్ధిచెబుతారు. నిన్నటి సభలో భవిష్యత్తులో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 ఎమ్మెల్యేలు, 15 ఎంపీ సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. బహుశా ఆ కాంగ్రెస్ నాయకులు టంగ్ స్లిప్ అయి మాట్లాడినట్లున్నారు. 100 మంది ఎమ్మెల్యేలు, 15 ఎంపీ సీట్లు బిజెపి గెలుస్తుందని చెప్పబోయి పొరపాటుగా కాంగ్రెస్ గెలుస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు "కాంగ్రెస్ ముక్త్ భారత్" అని నినదిస్తారన్నారు. ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపి ధర్మయుద్ధం చేస్తుంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం రెండు సీట్లు మాత్రమే గెలుచుకుంది.

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. బిజెపి మూడు ఎమ్మెల్సీ సీట్లు గెలుచుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు రూ. 4 వేల భృతి ఇస్తామని చెప్పి ఆ హామీని మర్చిపోయారు. సంపదతో ఉన్న తెలంగాణను భిక్షాటన చేసే స్థితికి తీసుకువచ్చారు. బిజెపి నాయకులు అందరి సహకారంతో, కార్యకర్తల బలంతో తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తాం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ల నుంచి జడ్పీటీసీల వరకు అన్ని సీట్లలో బిజెపి పోటీ చేస్తుంది. అత్యధిక స్థానాల్లో గెలుస్తుంది. హర్యానా, త్రిపుర వంటి రాష్ట్రాల్లో ప్రజలు బిజెపిని గెలిపించినట్లుగా తెలంగాణలోనూ గెలిపిస్తారు. బిజెపి పరిపాలనలో అవినీతి ఉండదు, అబద్ధాలు ఉండవు. తెలంగాణను వికసిత రాష్ట్రంగా మార్చేందుకు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరం. అందుకు కార్యకర్తలంతా కృషి చేయాలి. బిజెపి బలోపేతం అవుతోంది. త్వరలో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయం. "సెక్యులరిజం", "సోషలిజం" వంటి పదాలు కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ తర్వాత రాజ్యాంగంలో చేర్చబడ్డాయి. కాంగ్రెస్ మతపరమైన రాజకీయాలతో ఈ పదాలను చేర్చింది. దేశ చరిత్రలో ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులను కాలరాసిన పార్టీ కాంగ్రెస్. ఆపరేషన్ సిందూర్ విషయంలో భారత సైనికుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడే వాళ్లు ప్రజల ముందుకి వచ్చి క్షమాపణ చెప్పాలి. బడుగు, బలహీన వర్గాల కోసం మోదీ ప్రభుత్వం కృషిచేస్తోంది. స్వయంగా ప్రధానమంత్రి మోదీ గారే బ్యాక్‌వర్డ్ క్లాస్‌కు చెందినవారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో సగం మందికిపైగా ముఖ్యమంత్రులు బ్యాక్‌వర్డ్ వర్గాలకు చెందినవారే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బిజెపికి విశేష ఆదరణ లభిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 8 ఎమ్మెల్యేలు, లోక్‌సభలో 8 ఎంపీ స్థానాల్లో గెలుపుతో పాటు, తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 సీట్లలో విజయం సాధించాం. ఇవి బిజెపి బలపడుతున్న సంకేతాలు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటు శాతం స్థిరంగా పెరుగుతుండటం ప్రజల విశ్వాసానికి నిదర్శనం. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసింది.

అసలు ఆ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఆలోచన లేదు. కేవలం బీసీలను బిజెపి పార్టీ నుంచి డైవర్ట్ చేసేందుకే రిజర్వేషన్ల హామీ ఇచ్చింది. 42 శాతం రిజర్వేషన్ల విషయంలో తీసుకొచ్చిన బీసీ బిల్లుకు బిజెపి మద్దతు ఇచ్చింది. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే నన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయే సమయానికి రాష్ట్రంలో లక్షా 30 వేల ఉద్యోగ ఖాళీలు ఉండేవి. మరి ఆ ఖాళీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు భర్తీ చేయలేదు..తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ. 12 లక్షల కోట్ల నిధులు ఇచ్చింది. దీనిపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమా.. అని ప్రశ్నించారు.

# లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం చేపట్టేలా చూడాలి : ఎంపీడీఓ సురేందర్



ఖమ్మం, జులై 5: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కమిటీ సభ్యులతో శనివారం కారేపల్లి ఎంపీడీఓ సురేందర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు మంజూరైన వారు వెంటనే ముగ్గులు పోసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. కొత్తగా 390 ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రణాళికను రూపొందించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఇవి కేవలం గిరిజనులకు మాత్రమేనని పేర్కొన్నారు. అదేవిధంగా ఇతర ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పెంపును త్వరితగతిన పూర్తి చేసి జాబితాను అందజేయాలని పేర్కొన్నారు.

# తల్లిదండ్రుల సంరక్షణ వారి పిల్లలదే.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**వయో వృద్ధుల సంరక్షణ చట్టం పరిధిలోని ఓ కేసులో 30 రోజులలో ఇంటిని ఖాళీ చేయాలని తీర్పు**

పెద్దపల్లి, జూలై5 : జన్మనిచ్చిన తల్లిదండ్రుల బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత వారి సంతానంపై ఉంటుందని, నిర్లక్ష్యం చేసిన వారిపై చట్ట రిత్యా చర్యలుంటాయని కలెక్టర్ శ్రీహర్ష హెచ్చరించారు. కలెక్టరేట్‌లో వయో వృద్ధుల సంరక్షణ చట్టం పరిధిలో ఓ కేసును విచారించి తీర్పును శనివారం వెల్లడించారు.

రామగుండం మండలం ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు తన కుమారుడు తన సంక్షేమం, పోషణ చూసుకోవడం లేదని తనని మానసికంగా వేదిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, తన కుమారుడిని ఇంటి నుంచి ఖాళీ చేయించాలని దరఖాస్తు చేసుకోగా, విచారణ చేపట్టి 30 రోజుల్లో ఇళ్లు ఖాళీ చేయాలని కలెక్టర్ తీర్పునిచ్చారు. ఎఫ్‌సీఐ ఏరియాకు చెందిన ఓ వృద్ధురాలు తన కుమారుడు తన సంక్షేమం, పోషణ చూసుకోవడం, మానసికంగా వేదిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, తన కుమారుడిని ఇంటి నుంచి ఖాళీ చేయించాలని పెద్దపల్లి ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోగా, ఇళ్లు ఖాళీ చేయాలని ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులు అమలు కాలేదని, తన భర్త నిర్మించిన ఇంటిలో తన మిగిలిన శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని తన కుమారుడిని ఇంటి నుంచి ఖాళీ చేయించి న్యాయం చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం 2007 కింద అప్పీలుగా స్వీకరించి, ఇరువర్గాలకు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. శనివారం పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం 2007లోని సెక్షన్ (23) , 21(3)(బి) ప్రకారం అర్జీదారు భద్రత, శ్రేయస్సు గౌరవాన్ని పరిగణనలోకి తీసుకొని అర్జీదారు కుమారుడు 30 రోజులలో ఇంటిని ఖాళీ చేయాలని, ఇకపై అర్జీదారునకు ఎటువంటి ఇబ్బందులకు గురి చేయరాదని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# స్వచ్ఛ ఇంధన మౌలిక వసతులను బలోపేతం

న్యూఢిల్లీ, జులై 5:ది వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ కి చెందిన ఇండియన్ నేషనల్ కమిటీ ఈ రోజు హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి కాపర్ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. ఉత్తమమైన గనుల మూసివేత పద్ధతుల ద్వారా సుస్థిరమైన, బాధ్యతాయుతమైన మైనింగ్ అనే అంశంపై ఈ సదస్సు జరిగింది.

భారత ఇంధన రంగంలో వస్తున్న మార్పులు, మౌలిక వసతుల వృద్ధి, విద్యుత్ వాహనాలు, సోలార్ విద్యుత్ లాంటి హరిత సాంకేతికతల్లో రాగి అందిస్తున్న సహకారాన్ని శ్రీ కిషన్ రెడ్డి వివరించారు. ముడి వనరుల భద్రతకు హామీ ఇస్తూనే దేశీయంగా పెరుగుతున్న గిరాకీని తీర్చేందుకు అవసరమైన దీర్ఘకాలిక వ్యూహాన్ని ఈ విజన్ డాక్యుమెంట్ అందిస్తుందని ఆయన అన్నారు. హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్), హిండాల్కో ఇండస్ట్రీస్, కచ్ కాపర్, వేదాంత, ఇండో-ఆసియా కాపర్, లోహమ్ తదితర సంస్థలతో పాటుగా, ఇండియన్ ప్రైమరీ కాపర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐపీసీపీఏ), ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ (ఐసీఏ) లాంటి పరిశ్రమ సంఘాలతో విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ డాక్యుమెంట్‌ను తయారు చేశారు.

2047 నాటికి ఆరు రెట్లు డిమాండ్ పెరుగుతుందని కాపర్ విజన్ డాక్యుమెంట్ అంచనా వేస్తోంది. అలాగే 2030 నాటికి ద్రవీకరణ, శుద్ధి చేసే సామర్థ్యం ఏడాదికి 5 మిలియన్ టన్నుల మేర పెంచే ప్రణాళికను అందిస్తుంది. అంతర్జాతీయ భాగస్వామ్యాలతో విదేశాల్లోని ఖనిజ వనరులను పొందడం ద్వారా రెండో దశ శుద్ధిని పెంపొందించడం, దేశీయంగా పునర్వినియోగాన్ని ప్రోత్సహించడం, బహిరంగ మార్కెట్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంపై దృష్టి సారిస్తుంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వికసిత్ భారత్ 2047 దార్శనికతకు అనుగుణంగా దేశం కోసం సుస్థిరమైన, చురుకైన, భవిష్యత్తు అవసరాలకు తగిన రాగి వ్యవస్థను తయారుచేసే దిశగా వేసిన ముందడుగే ఈ కాపర్ విజన్ డాక్యుమెంట్.

# బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టులో ఏడీఆర్ కేసు నమోదు

న్యూఢిల్లీ జులై 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స);: బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలని ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లేదా ఎస్ఐఆర్ చేయాలని తన ఆదేశాల్లో సూచించింది. దీన్ని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ వ్యతిరేకించింది. ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఏడీఆర్ కేసు నమోదు చేసింది. ఈ ఏడాదిలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈసీ ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టాలని ఏడీఆర్ ఎన్జీవో తన పిటీషన్‌లో కోరింది. ఆ ఆదేశాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21, 325, 326ని ఉల్లంఘిస్తున్నట్లు ఉందన్నారు. ఈ పిటీషన్‌ను అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ ఫైల్ చేశాడు. సరైన విధానం లేకుండా ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తే లక్షలాది మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేరన్నారు. స్వేచ్ఛగా ఎన్నికలు జరగలేవన్నారు. ఓటర్ల జాబితా సవరణకు డాక్యుమెంట్లను తక్కువ సమయంలో సమకూర్చలేమన్నారు. 2003లో చివరిసారి బీహార్‌లో ఓటర్ల జాబితాను సమీక్షించారు. ప్రస్తుతం బూత్ ఆఫీసర్లు ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నారు. వెరిఫికేషన్ కోసం ఇంటింట తిరుగుతున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఎలక్టోరల్ రోల్ రివిజన్ కొనసాగుతుందని ఈసీ పేర్కొన్నది.

# తాగి వచ్చి తనని వేధిస్తున్నాడని భర్తను గొంతు నులిమి హత్య చేసిన భార్య

హైదరాబాద్ జూలై 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);నగరంలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. నిత్యం మద్యం తాగి వచ్చి తనని వేధిస్తున్నాడని కారణంగా భర్తను భార్య గొంతు నులిమి హత్య చేసింది. ఆపై అది సాధారణ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. 2014లో మహబూబ్‌నగర్ జిల్లా రామకృష్ణయ్య పల్లికి చెందిన అంజిలప్పకు రాధ అనే మహిళతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. గతంలో ముంబైతో పాటు హైదరాబాద్‌లోని మణికొండలో నివాసం ఉన్నారు. తాజాగా నిజాంపేటలోని ఓ భవన నిర్మాణ సంస్థలో కార్మికులుగా చేరారు. అక్కడే గుడిసెలో నివాసం ఉంటూ.. నిత్యం గొడవపడేవారు. అంజిలప్ప రోజు తాగి వచ్చి.. భార్య రాధను అనుమానిస్తూ ఉండేవాడు. ఇది తట్టుకోలేకపోయిన రాధ.. జూన్ 22న రాత్రి మద్యం మత్తులో ఉన్న భర్తను గొంతు నులిమి హత్య చేసింది. ఆపై దాన్ని సహజ మరణంగా చిత్రీకరించింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి.. అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తుండగా.. మృతుడి బంధువులకు అనుమానం వచ్చి నారాయణపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును బాచుపల్లి స్టేషన్‌కు బదిలీ చేశారు. దర్యాప్తులో భర్తను రాధ హత్య చేసినట్లు నిర్ధారణ జరిగింది. దీంతో ఆమెను న్యాయస్థానంలో హాజరుపరిచారు.

# ప్రపంచ శాంతి కోసం ప్రత్యంగిరా వారాహి యజ్ఞం



విజయవాడ జూలై 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రపంచ శాంతి కోసం , ప్రజలందరు సుఖ శాంతులతో ఉండాలని ప్రత్యంగిరా వారాహి మాత ఆశీస్సుల వల్ల జరగాలనే సంకల్పంతో విజయవాడ కృష్ణలంక లోని హరిహర గో సేవ క్షేత్రంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పైనైట్ ఇన్ఫో సొల్యూషన్స్ సిఎండి నవీన్ పామిడి ల సౌజన్యంతో జరిగిన వారాహి ప్రత్యంగిరా మాతల నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన పూర్ణాహుతి కార్యక్రమానికి పైనైట్ ఇన్ఫో సొల్యూషన్స్ సిఎండి నవీన్ పామిడి ప్రత్యేక అతిథిగా హాజరై పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించిన శంకర విశ్వేశ్వర స్వామి, నారాయణి ప్రత్యంగిరా మాత పీఠాధిప

# ఎపిలో నరకాసుర పాలన జరుగుతోంది

**-మనుషుల రూపంలో ఉన్న సైకోల పాలన నడుస్తోంది**
**-ఎపి మాజీ మంత్రి పేర్నినాని ధ్వజం**

అమరావతి జూలై 5 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): ఎపిలో టిడిపి నేతలు ప్రతి రోజూ వైఎస్ఆర్ సిపి నేతలపై హత్యలు, హత్యాయత్నాలు చేస్తున్నారని,రాష్ట్రము లో నరకాసుర పాలన జరుగుతోందని, మనుషుల రూపంలో ఉన్న సైకోల పాలన నడుస్తోందని ఎపి మాజీ మంత్రి పేర్నినాని ధ్వజమెత్తారు.. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ ముసుగులో హత్యలు చేస్తున్నారని ప్రతిరోజూ ఆడపిల్లలు బలి అవుతున్నారని అన్నారు విమర్శించారు. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు పాలనపై ప్రజల్లో ఏహ్యాభావం ఏర్పడిందని చెప్పారు. వైయస్ఆర్ సిపి వాళ్లకు పనులు చేయొద్దని చెబుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయని విమర్శించారు.

పోలీస్ వ్యవస్థ ఎక్కడుంది అని ప్రశ్నించారు. చంద్రబాబుతో సహా టిడిపి నేతలు కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని దాడులు చేయమని, భయపెట్టమని, ఊళ్లోంచి తరిమేయమని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి మాజీ సర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబానికి మంచి పేరుందని, నాగమల్లేశ్వరరావు కుటుంబానికి నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉందని తెలియజేశారు.

టిడిపి నేతల దోపిడిని అడ్డుకోవడమే నాగమల్లేశ్వరరావు చేసిన నేరమా.. అని వైసిపి మాజీ ఎమ్మెల్యే బాబురావు మీద దాడి చేసి కొడుతుంటే అడ్డువడింది నాగమల్లేశ్వరరావు కాదా.. అని పేర్నినాని నిలదీశారు.

# మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం..

**- 20 ఏళ్ల తర్వాత ఒకే వేదిక పై మళ్లీ కలిసిన థాక్రే సోదరులు**



ముంబై జూలై 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. థాక్రే సోదరులు (ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే) మళ్లీ కలిశారు దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదిక పంచుకున్నారు. ఇకపై ఇద్దరం కలిసే ఉంటామని ఈ సందర్భంగా సోదరులు స్పష్టం చేశారు. త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇవాళ ముంబైలో 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే మహారాష్ట్ర నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ థాక్రే ఇద్దరూ కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇద్దంహా ఆప్యాయంగా మాట్లాడు కున్నారు. 2005లో విడిపోయిన ఈ ఇద్దరు అన్నదమ్ములు 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ కలుసుకోవడం మహా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. అన్నదమ్ముల కలయికపై ఇరు పార్టీల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వల్లే తాము కలిశామని రాజ్ థాక్రే వ్యాఖ్యానించారు. సీఎం రాష్ట్రానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయమే తమని కలిపిందన్నారు. అనుకోకుం డానే ఒకే వేదికపై చేర్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై థాక్రే సోదరులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇకపై తామిద్దరం ఒక్కటిగా ఉంటామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాగా, అన్నదమ్ములిద్దరూ చివరి సారిగా 2005లో ఒకేవేదికపై కనిపించారు. ఆ తర్వాత శివసేనలో గొడవల కారణంగా రాజ్ థాక్రే పార్టీ వీడారు. 2 006 మార్చి 9వ తేదీన సొంతంగా మహారాష్ట్ర నవ నిర్మాణ సేనను స్థాపించారు.

# ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి....శాసన సభ్యులు డా.భూక్య మురళి నాయక్

మహబూబాబాద్, జులై 5:(నేటినిజం ప్రతినిధి): శనివారం మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామంలో జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మరియు ఉద్యాన పంటల అవగాహన కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు డా. భూక్య మురళి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్ సాగు చేసి ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం పొందాలని తెలిపారు.

ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి. మరియన్న మాట్లాడుతూ ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల



నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలి. కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు

.ఈ కార్యక్రమంలో రైతులు బానోత్ హరి, సి. హెచ్. సంపత్ రెడ్డి, బానోత్ సూర్యం, బానోత్ రాములు, బానోత్ వెంకన్న, భూక్య బాలకిషన్, బానోత్ పద్మ, భూక్య పద్మ, భూక్యా శివలాల్, భూక్యా శైలజ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. తిరుపతి రెడ్డి, ఉద్యాన అధికారి ఎ. జె. శాంతి ప్రియదర్శిని, తహసీల్దార్ రాజేశ్వర్ రావు, యం. పి. డి. ఓ. రఘుపతి రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు బాలాజీ, షాహీన్, టి. జి. ఆయిల్ ఫెడ్ క్షేత్ర సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.